

అప్పనపల్లి బాలబాలాజీ ఆలయానికి భక్తుల తాకిడి
వార్త..7లో

వాడపల్లి కిటకిట




వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు



ఆత్రేయపురం, జూన్ 22: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, బాలబోగం, ఐశ్వర్య లక్ష్మీ హోమం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడ ప్రదిక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామ స్మరణతో అశేష భక్తజనం స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. తలనీలాలు.. తులాభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం సాయంత్రం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.39.32లక్షలు లభించినట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం



ప్రత్యేక అలంకరణ నిర్వహించిన దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 22: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహిని కేశవస్వామి క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. వేకువజామునే సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామివారికి శ్రీపుష్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించి వివిధ రకాల పిండి వంటలు, ఫలాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పవళింపు సేవ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ఈవో కృష్ణ చైతన్య ఏర్పాట్లు నిర్వహించారు.

1836 ఎకరాల్లో పూర్తయిన నారు మడులు



నారు మడులు పరిశీలిస్తున్న అధికారులు

అల్లవరం, జూన్ 22: జిల్లాలో 1836 ఎకరాల్లో సార్వా వరి నారు మడులు పూర్తి అయ్యాయని, జిల్లా వ్యాప్తంగా 1,68,780 ఎకరాల్లో సార్వా వరి సాగు లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. శనివారం అల్లవరం మండలం కోడూరుపాడులో వ్యవసాయాధికారులతో కలిసి ఆయన వరి నారుమడులు పరిశీలించారు. 593 ఎకరాల్లో వెద జల్లు పద్ధతిలో వరిసాగు, 30 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా సార్వా పంట కాలానికి 43,642 టన్నుల ఎరువులు ప్రైవేటు ఎరువుల షాపులు, సహకార సంఘాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ నెలాఖరులోగా రైతులు సార్వా నారుమడులు పూర్తి చేయాలన్నారు. అధిక వర్షాలు తట్టుకునే ఎంటీయూ-1318, ఎంటీయూ-1064 వరి రకాలను పండించాలన్నారు. అల్లవరం మండలంలో ఇప్పటి వరకు 50 ఎకరాల్లో వరి నారుమడులు పూర్తి అయ్యాయన్నారు. మండల వ్యవసాయాధికారి నందెపు వీరవెంకటసత్యనారాయణ, ఏఈవో జి.శివమోహన్, శ్రావణి, పాటి సంహాద్రి, జల్లి అన్నవరం, పాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

అమలాపురం టౌన్, జూన్ 22: మెగా డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులకు తూర్పుగోదావరి జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 1 నుంచి ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు స్టడీ సర్కిల్ సంచాలకుడు పిల్లి సత్యరమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సబ్జెక్టుకు సంబంధించి ప్రాక్టీసు టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారన్నారు. లైబ్రరీ సదుపాయం ఉందని, రెండు నెలల శిక్షణా కాలంలో అభ్యర్థులకు రూ.వెయ్యి స్టడీ మెటీరియల్‌తో పాటు నెలకు రూ.1500 స్టైఫండ్, బుక్స్ అలవెన్స్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తులతో పాటు పదో తరగతి, ఇంటర్, ఎస్టీటీ టెస్ట్ క్వాలిఫైడ్ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఇతర జిరాక్సు కాపీలను దరఖాస్తుకు జతచేసి టూ ది డైరెక్టర్ ఏపీబీసీ స్టడీ సర్కిల్, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల పక్కన-533103కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉచిత శిక్షణ పొందేవారు వివరాలకు సెల్ 9393934825 ను సంప్రదించాలన్నారు.

వైసీపీకి భూ సంతర్పణ



వైసీపీ కార్యాలయం కోసం ప్రతిపాదించిన జనుపల్లి శ్మశానవాటికను ఆనుకుని ఉన్న స్థలం



ఈ చెరువు స్థలాన్నే అధికారులు కేటాయించింది..!

వైసీపీ కార్యాలయానికి చెరువు స్థలం..!

- సమీప గ్రామస్థులు అభ్యంతరాలు చెప్పినా నేతల ఒత్తిళ్ల మేరకు కేటాయింపు
- జనుపల్లిలో వైసీపీ కార్యాలయ నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయింపు..
- ఎటువంటి నిర్మాణాలు చేపట్టని వైసీపీ.. లీజు రద్దు చేయనున్నారా?
- స్థలం లీజుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గతంలో రాష్ట్రంలో అడ్డగోలుగా వైసీపీ కార్యాలయాలకు ప్రభుత్వ భూమి సంతర్పణ చేయడంపై కొత్త ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యాలయాల పేరుతో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తుండడంతో పాటు మిగిలిన అసంపూర్తి భవనాలు, కేటాయించిన స్థలాలకు ప్రస్తుతం నోటీసులు జారీ చేసే పనిలో అధికార యంత్రాంగం ఉంది. కోనసీమ జిల్లాలో కూడా కొన్ని నెలల క్రితం రెవెన్యూ ఉన్నతాధికారులు వైసీపీ నేతల ఆదేశాలతో ఆగమేఘాలపై ఫైల్ రెడీచేసి గోప్యంగా ఎకరం స్థలాన్ని అమలాపురం రూరల్ మండలం జనిపల్లి గ్రామంలో లీజు ప్రాతిపదికన తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. భూమి ఇవ్వడానికి గ్రామస్తులు అప్పట్లో నిరాకరిస్తుండడంతో వారిపై ఒత్తిడి తెచ్చి వైసీపీ కార్యాలయానికి స్థలం కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు తీవ్ర కృషి చేశారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి ఆనుకుని ఉన్న జనుపల్లి గ్రామంలో ఉన్న చెరువు స్థలాన్ని వైసీపీ కార్యాలయానికి ప్రతిపాదించారు. జనుపల్లి గ్రామంలోని సర్వే నంబరు 48లో ఎకరం భూమిని వైసీపీ జిల్లా కార్యాలయానికి ఇచ్చేందుకు అమలాపురం తహశీల్దార్ పి.శ్రీపల్లవి సంసిద్ధులై ఈ మేరకు రిఫరెన్స్ నంబరు ఏ-2932022తో ఈ మేరకు ఏ1 నోటీసును కూడా జారీ చేశారు. షెడ్యూల్‌లో పేర్కొన్న ఈ భూమి కోసం వైసీపీ శాఖ పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుందని, ఈ భూమిని లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు ఎవరికైనా ఆక్షేపణలు ఉంటే నోటీసు ప్రకటించిన పదిహేను రోజుల్లోగా తెలియ చేయాలని అప్పట్లో ఆ నోటీసులో పేర్కొన్నారు. రెవెన్యూ నిబంధనల ప్రకారం సంతకాలు చేయడానికి నిరాకరిస్తే వారి నుంచి సంజాయిషీ తీసుకోవాలని తహశీల్దార్ ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు. ఈ భూమిని రెవెన్యూ ఉన్నతాధికారులు గోప్యంగా పరిశీలించి వైసీపీ నేతలకు గోప్యంగా అప్పగించినట్టు ప్రచారం. సమీప గ్రామస్థులు ఎంతగా అభ్యంతరం చెప్పినా వైసీపీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గక తప్పలేదు. గ్రామానికి ఉపయోగకరమైన స్థలాన్ని ఇలా ఇచ్చేయడాన్ని చాలా మంది ఆక్షేపించారు. అయినప్పటికీ అధికారులు పై 'సార్లు' ఏం చెబితే అదే చేసేశారు. అడ్డగోలుగా కేటాయించేశారు. ఈ స్థలం వైసీపీకి కేటాయించిప్పటికీ జిల్లా నాయకత్వంలో నెలకొన్న లోపాల కారణంగా నిర్మాణ కార్యకలాపాలు ఇప్పటి వరకు ముందడగు పడలేదు. దాంతో వైసీపీకి కేటాయించిన ఎకరం భూమి అంతా చెరువుగానే ప్రస్తుతం మిగిలి ఉండి. ఇప్పుడు ప్రభుత్వం మారింది కాబట్టి ఈ స్థలాన్ని వైసీపీకి అప్పగిస్తారా. లేక ఆ లీజును రద్దు చేస్తారా అనేది తాజాగా ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ కార్యాలయాల నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో జనిపల్లి స్థలం లీజును కూడా రద్దు చేసే అవకాశాలున్నట్టు విశ్వసనీయ సమాచారం.

అతిసార నియంత్రణకు చర్యలు

కలెక్టర్ హిమాన్షుశుక్లా



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం, జూన్ 22(ఆంధ్రజ్యోతి): అతిసారను నివారించేందుకు జూలై 1 నుంచి ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్నైట్ క్యాంపైన్‌ను ప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఆగస్టు 31 వరకు ఈ క్యాంపైన్ జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌లో శనివారం హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల్లో అతిసారాన్ని అరికట్టేందుకు జింక్, ఓఆర్ఎస్ ప్యాకెట్ల వినియోగాన్ని పెంచాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్లను అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైమరీ హెల్త్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి అతిసారపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీల వద్ద కూడా వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో సంపూర్ణ పారిశుధ్యం ఉండేలా పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సీడీపీవోలు, మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలుషిత నీటిని తాగడం వల్ల అతిసార ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్ర పరచడంతో పాటు క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బి.సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ములు చెల్లించాలని రైతుల ఆందోళన
వార్త..8లో

అరటి ధరలు ఆశాజనకం



అరటి మార్కెట్ ధరలు గత రెండు నెలలుగా మందకొడిగా సాగుతున్నాయి. ప్రస్తుతం దిగుబడి లేకపోవడంతో రోజురోజుకూ గిరాకీ పెరిగి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అంతర్రాష్ట్ర అరటి మార్కెట్ యార్డుగా ఖ్యాతిగాంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో లావాదేవీలు ఊపందుకున్నాయి.



దిగుబడి లేకపోవడంతో పెరుగుతున్న గిరాకీ

రావులపాలెం, జూన్ 22: అంతర్రాష్ట్ర అరటి మార్కెట్ యార్డుగా ఖ్యాతిగాంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు కర్పూర, తెల్ల చక్రకేళి, ఎర్ర చక్రకేళి, అమృతపాణి, బుషావళి, కూర అరటి గెలలను రోజుకు సగటున 10 వేల గెలలను రైతులు తీసుకువస్తారు. ఇక్కడి వ్యాపారులు వాటిని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటకు కనీస ధర రాక గత రెండు నెలలుగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూఢం కారణంగా ధరలు మరింత దిగజారాయి. అయితే మూఢం ముగిసేనాటికి అరటి మార్కెట్ పుంజుకుటుందని, ధరలు పెరిగి పెట్టుబడులు పోను లాభాల బాటలో పయనించవచ్చని అరటి రైతులు భావిస్తున్నారు. అరటి తోటలు కూడా తయారీ దశకు చేరుకుంటున్న తరుణంలో ఇటీవల సంభవించిన తుఫాను, ఈదురుగాలుల ప్రభావంతో జిల్లాలోని అరటి తోటలు నేలకొరిగి పంట మొత్తం పాడైంది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఈ కారణంగా గెలలకు కొంతమేర గిరాకీ పెరిగి రైతులు ఊరట చెందే పరిస్థితి ఏర్పడింది. కర్పూర రకం గతంలో రూ.100 నుంచి రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.180 నుంచిరూ.300, చక్రకేళీ తెలుపు గతంలో రూ.150 నుంచి రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.250 నుంచి రూ.350, చక్రకేళీ ఎరుపు గతంలో రూ.200 నుంచి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.300 నుంచి రూ.500 ధర పలుకుతున్నాయి. అమృతపాణి గతంలో రూ.200 నుంచి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.300 నుంచి రూ.400, కూర అరటి సగటున రూ.200 నుంచి రూ.500 వరకు సరాసరి ధర పలుకుతున్నాయి. స్థానిక అరటి మార్కెట్ యార్డు నుంచి రోజూ సుమారు 10వేల అరటి గెలలు ఎగుమతి అవుతుండగా ఒడిసా, భువనేశ్వర్, చెన్నై, తమిళనాడు, తెలంగాణాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతున్నాయి. అయితే వచ్చే నెలలో గెలలకు మరింత గిరాకీ పెరిగే అవకాశం ఉన్నప్పటికీ దిగుబడి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి సుభాష్‌కు ఎంపీల సత్కారం



కార్మిక శాఖ రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం విజయవాడ గురునానక్‌నగర్‌లోని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నివాసానికి వెళ్లారు. చిన్నితో పాటు అక్కడే ఉన్న అమలాపురం ఎంపీ జీఎంసీ హరీశ్ బాలయోగిని కలిశారు. మంత్రిని ఎంపీలిద్దరూ సత్కరించారు. పార్లమెంట్ సమావేశాలకు తొలిసారి హాజరుకాబోతున్న ఎంపీలకు మంత్రి సుభాష్ శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల విశేషాలతో పాటు కార్మిక రంగంలోని పలు అంశాలపై వారు చర్చించుకున్నారు.

• ద్రాక్షారామ

ఎన్నాళ్లిలా..?

జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఉప ఖజానా కార్యాలయం 1905లో బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనంలోనే కొనసాగుతోంది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తుంది. వర్షాకాలంలో ఫైళ్లను భద్రపరుచుకునేందుకు సిబ్బంది పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.





మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించిన శిలాఫలకం

అమలాపురం టౌన్, జూన్ 22: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉప ఖజానా కార్యాలయ భవన నిర్మాణానికి ముందుకు వచ్చారు. రూ.75 లక్షల అంచనా వ్యయంతో అమలాపురం సబ్‌జైలు ఎదురుగా ఉప ఖజానా కార్యాలయ భవన నిర్మాణానికి 2021లో మంత్రి పినిపే విశ్వరూప్ శంకుస్థాపన కూడా చేశారు. నిధులు ఉండి చేశారో లేకుండా శంకుస్థాపన చేశారో ఏమో గానీ ఒక్క ఇటుక పెట్టిన దాఖలా కూడా అక్కడ లేదు. ఆర్థికశాఖ నిధులతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. ఇప్పుడా నిధులు ఉన్నాయో, మురిగిపోయాయో తెలియదు. భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం చుట్టూ చెత్తాచెదారం మాత్రం పేరుకుపోయింది.

పెద్దిరెడ్డి పేషీతో 'షెకావత్' లింకులు


వై.రామవరం మండలంలో అడవిలో చెట్లు నరికి అక్రమంగా నిర్మించిన ప్రైవేటు రహదారి

మారేడుమిల్లి అడవుల్ని అడ్డాగా చేసుకుని టేకు దొంగలకు రాజబాట వేసి అటవీ వినాశనానికి అండగా నిలిచి, అన్నింటా ఆగడాలు, దందా సాగించిన అటవీ ఉన్నతాధికారికి ఏకంగా అప్పటి అటవీ మంత్రి పేషీతోనే లింకులున్నాయి. ఆ అండతోనే టేకు ప్లాంటేషన్లలో వందలాదిగా చెట్లను నరికేసి అక్రమంగా తరలిపోయినా, ఆయన పరిధిలో ఎక్కడ అవకాశం ఉన్నా అక్కడ అక్రమాలు సాగించేయడం ఆయన హయాంలో ప్రహసనంగా సాగింది. గిరిజన రైతుల పట్టా భూముల్లోని టేకు చెట్లకు అనుమతులు, ఎకో టూరిజం ప్రాజెక్టుల నిర్వహణ, అడవిలో రోడ్ల నిర్మాణాలకు అడ్డగోలు అనుమతులు ఇలా అవకాశం ఉన్న ప్రతి వ్యవహారంలోనూ ఆయన, ఆయన బృందం సాగించిన అక్రమాలు కోకొల్లలు.

- ఆ అండతోనే అన్ని విభాగాల్లోనూ అక్రమాలు
- ఆయన భాగోతాలపై విచారణాధికారులుగా ఆయనకు నచ్చిన వారే!
- ప్రభుత్వం మారి పవన్ చేతిలోకి అటవీశాఖ ఉండటంతో ఆందోళన

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

అల్లూరి జిల్లా రంపచోడవరం అటవీ డివిజన్లో గత ప్రభుత్వ తీరుకు అనుగుణంగా పలు అక్రమాలు జరిగాయి. గిరిజనులు పోడు వ్యవసాయం సాగిస్తే తీవ్ర నేరంగా పరిగణించే వ్యవస్థలో అటవీ కార్యక్రమాల ముసుగులో అక్రమాలకు తెరలేపేశారు. ముఖ్యంగా వచ్చేది ఎలాగూ తమ ప్రభుత్వమే అనుకున్నారో ఏమోగానీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే అన్నీ చక్కబెట్టేశారు. గిరిజన రైతుల పట్టా భూములలో ఉండే టేకుచెట్ల నరికివేత, వాటి రవాణాకు సంబంధించిన ఫైళ్ల నిర్వహణతో సదరు అధికారి కార్యాలయం రచ్చకెక్కింది. దీంతో ఓ బాధితుడి ఫిర్యాదుతో ఆయన టార్గెట్‌గా ఏసీబీ అధికారులు దాడి చేయగా ఆ కార్యాలయంలోని ఓ రేంజ్ అధికారి దొరికిపోయారు. తర్వాత క్రమంలో మారేడుమిల్లి రేంజ్ పరిధిలోని టేకు ప్లాంటేషన్లలోని సుమారుగా 378 టేకు చెట్ల నరికివేత రాష్ట్రంలోనే సంచలనంగా మారి వరుసగా మీడియాలో షెకావత్ లీలలన్నీ వెలుగు చూశాయి. ఈ బాగోతాలన్నిటిపైనా పీసీసీఎఫ్ కార్యాలయం విచారణకు ఆదేశిస్తే శాఖలో షెకావత్‌కు నచ్చిన అధికారులనే విచారణాధికారులుగా నియమించారు. దీంతో విచారణను మొక్కుబడిగా సాగించి నరికివేయబడిన చెట్ల లెక్కలను మాత్రం తేల్చి, దిగువ స్థాయి అధికారులపై చర్యలు తీసుకుని వదిలేశారన్న విమర్శలు శాఖలోనే వినిపిస్తున్నాయి. ఎక్కడైనా అక్రమాలు జరిగితే ఆరోపణలను ఎదుర్కొంటున్న అధికారులను అక్కడి నుంచి తప్పించి విచారణ జరపడం రివాజు. కానీ ఇక్కడ మాత్రం సదరు అధికారి కనుసన్నలలోనే విచారణ జరిపిన పరిస్థితులు నెలకొన్నాయి. అక్రమ టేకు చెట్ల నరికివేత వ్యవహారంలో పోలీసు ఫిర్యాదుచేసి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి దర్యాప్తు సాగించాలని ఇచ్చిన ఆదేశాలు కూడా గాలికొదిలేశారు. ఈ టేకు చెట్ల వ్యవహారం సాగుతుండగానే మారేడుమిల్లి రేంజ్ పరిధిలో నడుస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టులలో కూడా అనేక అక్రమాలు వెలుగు చూశాయి. కమిటీలు లేకుండానే కార్యకలాపాలు సాగించడం, నిధులను డ్రా చేయడం, నిబంధనలకు విరుద్ధంగా వాటి నిధులను తమ నివాసాల కోసం వెచ్చించడం వంటి బాగోతాలపై విచారణ సాగుతున్నా అది కూడా ఆయన కనుసన్నలలోనే సాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి. కాగా కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం మారడంతో పర్యావరణాన్ని కాంక్షించే కొందరు ఈ వ్యవహారాలపై ధైర్యంగా ముందుకు వచ్చారు. గతంలో టేకు చెట్ల నరికివేత వ్యవహారంలో విచారణ నిర్వహించిన అధికారులకే ఎకో టూరిజం విచారణ అప్పగించడంపై కొందరు నేరుగా సీసీఎఫ్‌ను కలిసి కొందరు డీఎఫ్‌వోల వల్ల విచారణ పక్కదారి పడుతోందని, వారిని తప్పించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించడంతో ఇద్దరు డీఎఫ్‌వోలను తప్పించి ఎకో టూరిజం విజిలెన్స్ డీఎఫ్‌వో ఒకరికి అప్పగించారు. ప్రస్తుతం ఆయన ఈ విచారణను సాగిస్తుండగా ఆయనపై కూడా సదరు అధికారి ప్రభావం చూపాలని ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయింది. ఇదిలాఉండగా అటవీ ప్రాంతం మీదుగా వెళ్లే అనేక రోడ్ల నిర్మాణాలకు కూడా ఆయా కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసం అడ్డగోలు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. వై.రామవరం మండలంలో తాడికొండ అటవీ ప్రాంతంలో వైసీపీ అండతో ఓ వ్యక్తి పెద్ద ఎత్తున అటవీ వినాశనానికి పాల్పడి తన భూముల కోసం రహదారి నిర్మిస్తే మొక్కుబడి చర్యలతో ప్రోత్సహించారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్సీ, ఇతర కేంద్ర సర్వీసుల అధికారుల అండతో పాటు అటవీ మంత్రి పేషీతో ఉన్న లింకులతో ఈయనకు ఎదురు నిలిచేవారే లేకుండా పోయారు. ఇక్కడ బాగోతాల వాస్తవాలను నివేదించిన ఓ అధికారి నివేదించిన తీరు ఉన్నతాధికారులకు తెలిసినా స్పందించలేదు. కాగా తీవ్రత లేకుండా ఓ నివేదికను ప్రభుత్వానికి పంపించగా ఎలాగూ వచ్చేది తమ ప్రభుత్వమే అన్న ధీమాతో ఎన్నికలు దాటాకా దాని సంగతి చూసుకుందామనుకుంటే రాష్ట్రంలో పాలనా పగ్గాలే మారిపోయాయి. అందునా అటవీశాఖ బాధ్యతలు పవన్‌కల్యాణ్ తీసుకోవడంతో వైసీపీ నాయకులతో అంటకాగిన ఇక్కడి అక్రమాల అధికార బృందానికి చెమటలు పడుతున్నాయి. ముఖ్యంగా ఎవర్ని నమ్మి ఇంతకాలం యథేచ్ఛగా అక్రమాలను కొనసాగించారో ఆయా ఉన్నతాధికారులు సైతం చేతులెత్తేశారు. తనకు అండగా నిలిచే వారి పరిస్థితులే ప్రతికూలంగా మారిన సందర్భం షెకావత్ బృందాన్ని షేక్ చేస్తోంది. ఏం జరుగుతుందో ఇక చూడాలి మరి.

రంపచోడవరంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ పర్యటన

రంపచోడవరం, జూన్ 22: రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు చిరంజీవిచౌదరి శనివారం రంపచోడవరం డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అటవీశాఖ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. ఇటీవల మారేడుమిల్లి రేంజ్ పరిధిలో చోటుచేసుకున్న టేకు అక్రమ కలప నరికివేత తదితర అక్రమాలపై జరిగిన విచారణ తదనంతరం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.


పాపికొండ అభయారణ్యంను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో చీఫ్ కన్సర్వేటర్


బాలబాలాజీ దర్శనానికి బారులు తీరిన భక్తులు

అప్పనపల్లికి భక్తుల తాకిడి

మామిడికుదురు, జూన్ 22: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. శనివారం స్వామివారిని 3271 మంది దర్శించుకుని, 2084 మంది నిత్యాన్నదాన పథకంలో భోజనాలు చేశారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,99,163 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది తలెత్తకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అలాగే బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కైకలూరుకు చెందిన పెన్మెత్స మణికంఠ కృష్ణంరాజు-స్వాతి దంపతులు రూ.10వేలు విరాళంగా అందించారు. తమ కుమారుడు క్రితిన్‌వేదాంతవర్మ పుట్టినరోజు డిసెంబరు 1వ తేదీ ప్రతీ సంవత్సరం అన్నదానం జరిపించాలని ఈ విరాళం అందించినట్టు సహాయ కమిషనర్ మాధవి తెలిపారు. విరాళమందించిన దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


శృంగారవల్లభస్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

పెద్దాపురం, జూన్ 22: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,14,700 అన్నదాన విరాళాలు రూ.65,742 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.7,560, తులాభారం రూ.300, లడ్డూ ప్రసాదం ద్వారా 26,835, వెరసి రూ.3,15,137 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి

రూ.2 లక్షలు విరాళాలు


చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూన్ 22: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దరు దాతల నుంచి రెండు లక్షలు విరాళం గా సమకూరాయి. అన్నవరానికి చెందిన కొంతం సతీష్, మణికంఠలు రూ.1,01,116లు దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించారు. ముమ్మిడివరానికి చెందిన మరో దాత చింతలపూడి బాలకృష్ణ, పోలావతి దంపతులు రూ.లక్ష పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. వారికి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

24 నుంచి కుమార రామ భీమేశ్వరాలయంలో

అభిషేకాలకు అనుమతులు మంజూరు

సామర్లకోట, జూన్ 22:పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఇటీవల శివలింగ జీర్ణోద్ధారణ పనులు అనంతరం ఈనెల 24 సోమవారం నుంచి శివలింగంపై అభిషేకాలకు భారతీయ పురావస్తు శాఖ అధికారులు (న్యూఢిల్లీ) నుంచి అనుమతులు మంజూరయ్యాయని ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం శనివారం సాయంత్రం తెలిపారు. గతనెల 28 నుంచి శివలింగ జీర్ణోద్ధారణ చర్యల కారణంగా మూలవిరాట్ దర్శనం నిలిపివేసిన విషయం విదితమే. గత వారం నుంచి స్వామివారి మూలవిరాట్ పూజా కైంకర్యాలు, దర్శనాలు అనుమతించగా శివలింగంపై అభిషేకాలకు మాత్రం అనుమతులు ఇవ్వలేదు. పలువురు భక్తుల నుంచి వచ్చిన విజ్ఞాపనల మేరకు భారతీయ పురావస్తుశాఖ ఉన్నతాధికారులు స్పందించి శివలింగంపై అభిషేకాలకు అనుమతులు మంజూరు చేశారు. ఈనెల 24 సోమవారం నుంచి యథావిధిగా స్వామివారికి అభిషేకాలు కొనసాగిస్తామని భక్తులు గమనించి స్వామివారిని దర్శించి స్వామి కృపకు పాత్రులు కాగలరని ఈవో నీలకంఠం తెలిపారు.

శనేశ్వరాలయానికి భక్తుల రద్దీ

కొత్తపేట, జూన్ 22: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) స్వామి ఆలయానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామివారి సర్వదర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,22,210 ఒకరోజు ఆదాయం సమకూరినట్టు సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.


శనేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అడ్రస్సు అడిగారు.. గొలుసు దోచేశారు..

గొల్లప్రోలు రూరల్, జూన్ 22: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు ఓ మహిళ మెడలోని బంగారం గొలుసును దుండగులు లాక్కెళ్లిపోయారు. ఆమె పోలీసులను ఆశ్రయించడంతో విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చేబ్రోలులోని హరేరామ ఆలయంవద్ద శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో కత్తిపూడి వెళ్లేందుకు పేరూరి లక్ష్మి అనే మహిళ ఆటో కోసం నిలబడింది. ఇంతలో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమెను అడ్రస్సు అడిగినట్టే అడుగుతూ మెడలో బంగారం గొలుసు లాక్కెళ్లిపోయారు. ఇంతలో మహిళ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని దుండగులను వెంబడించినా దొరకలేదు. దాంతో ఆమె భర్త త్రిమూర్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం వచ్చింది

- వైసీపీ పాలనలో అన్నిరంగాలు నిర్వీర్యం
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది
- ప్రతిపక్షం అనేది చట్టసభల్లో ప్రజల పక్షాన నిలబడాలి
- శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జూన్ 22: దోచుకునే ప్రభుత్వం పోయి ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం వచ్చిందరి శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. కాకినాడజిల్లా తుని రూరల్ మండలం తేటగుంట టీడీపీ కార్యాలయంలో విలేఖరులతో యనమల మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించి దాచుకోవడం దోచుకోవడమే లక్ష్యంగా పనిచేశారని వారికి అధికార యంత్రాంగం వత్తాసు పాడిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమర్థవంతంగా జరగాలంటే వ్యవస్థలను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. రాష్ట్రంలో కొలువుదీరిన ఎన్డీయే ప్రభుత్వ ఎన్నో సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని, రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వాటన్నింటినీ అధిగమించి చంద్రబాబు మంచి పాలన అందిస్తారన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఏ పేదరికం తొలగలేదని, అసమానతలు పెరిగిపోయాయన్నారు. వ్యవస్థలు సరైన మార్గంలో లేకపోవడంతో అవినీతి, అక్రమాలే రాజ్యమేలుతాయని జగన్ సర్కార్ రాజ్యాంగాన్ని సైతం అపహసం చేసిందన్నారు. ప్రతిపక్షం అనేది సక్రమంగా చేసి చట్ట సభల్లో ప్రజలకు మేలు చేసేలా పాటుపడాలని తెలిపారు. జగన్ విధ్వంస పాలనలో విసుగు చెందిన రాష్ట్ర ప్రజలు ఎన్డీయే ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. ప్రజాస్వామ్యంలో బలమైన పాత్ర పోషించేది మీడియా గొంతు నొక్కేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని జగన్ సొంత ఛానల్స్‌లో అసత్యాలు ప్రచారంచేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలనుకున్నారు.

అయ్యన్నకు యనమల శుభాకాంక్షలు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శాసనభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణ, తుని ఎమ్మెల్యే యనమల దివ్య శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నేత అయిన అయ్యన్నను స్పీకర్ పదవికి టీడీపీ ఎంపిక చేసి సముచిత స్థానం కల్పించిందని యనమల అన్నారు. శాసన సభ అయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కొత్త సభకు కృతజ్ఞతలు తెలిపి స్పీకర్ అయ్యన్నకు శుభాకాంక్షలు తెలిపారు. అయ్యన్నపాత్రుడు సమర్ధవంతంగా సభను నిర్వహిస్తారని సభా, సంప్రదాయాలకు అనుగుణంగా నూతన ఒరవడిని తీసుకొస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

సామర్లకోట, జూన్ 22: కాకినాడ జిల్లా సామర్లకోట భీమవరపుపేటకు చెందిన చింతాడ నరసింహం(29) అనే వ్యక్తి తన ఇంటిలోనే శనివారం విద్యుత్ ఘాత ంతో మృతి చెందాడు. సామర్లకోట మున్సిపల్ వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న నరసింహం రోజూలాగే విధుల కు హాజరయ్యేందుకు బట్టలు వేసుకుంటూ టీడీ స్విచ్‌ఆన్ చేయగా ప్లగ్ నుంచి విద్యుత్ ప్రవహించి శరీరానికి తాకింది. దీంతో అపస్మారక స్థితిలోకి చేరాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ పరీక్షించిన వైద్యులు నరసింహం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువుల రవాణాను అడ్డుకున్న పోలీసులు


పశువులను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

సామర్లకోట, జూన్ 22: పిఠాపురం నుంచి హైద్రాబాద్‌కు ఒక మినీ వ్యాన్‌లో అక్రమంగా 28 గేదె దూడలను రవాణా చేస్తున్నారన్న నేరంపై అక్రమ రవాణాదారులు ఇద్దరు వ్యక్తులపై సామర్లకోట పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. పశువుల వధశాలకు తరలిస్తున్నారన్న సమాచారంతో సామర్లకోట శివారున పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. 28 దూడలను, రవాణాకు వినియోగించిన మినీ వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 మంది 'నన్నయ' ఆచార్యులకు రూస ప్రాజెక్టులు


నన్నయ ఆచార్యులకు రూస ప్రాజెక్టు పత్రాలను అందజేసిన వీసీ

దివాన్‌చెరువు, జూన్ 22: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎనిమిది మంది ఆచార్యులకు రాష్ట్రీయ ఉచ్చ తర్ శిక్షా అభియాన్ (రూస) ద్వారా ప్రాజెక్టులు మంజూరయ్యాయని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో సంబంధితులకు ప్రాజెక్టు పత్రాలను శనివారం వీసీ అందజేసి అభినందించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ యూనివర్శిటీ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగానికి చెందిన ఆచార్య కె.శ్రీరమేష్, ఎస్.సజన్‌రాజ్‌లకు, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య కేవీ స్వామి, ఆచార్య డి.కళ్యాణి, కె.నూకరత్నం, ఎ.మట్టారెడ్డి, పి.విజయనిర్మలకు ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. రూస నిధులతో నిర్వహించే ఈ ప్రాజెక్టులను సమర్థవంతంగా పూర్తిచేసి కొత్త విషయాలను సమాజానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

యోగా కాన్షియస్ ట్రస్ట్‌తో 'నన్నయ' ఎంవోయూ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్స్ ఆఫ్ యోగా కాన్షియస్ ట్రస్ట్(వైసీటీ) గోదావరిశాఖ కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా మధ్య అవగాహన ఒప్పందాన్ని తిరిగి ప్రారంభించామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం ఎంఓయూ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సుధాకర్, శ్రీరాపర్తి రామ యోగా సంస్థ కార్యదర్శి ఎంవీజీఎస్ శర్మ ఎంవోయూలపై సంతకాలుచేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వైసీటీ, నన్నయవర్సిటీ మధ్య ఎంవోయూ తిరిగి ప్రారంభించామని, విద్య పరిశోధనలను ప్రోత్సహించడానికి సంయుక్తంగా పనిచేస్తామన్నారు. సంస్థ సహకారంతో పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సును అందిస్తున్నామని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ పాల్గొన్నారు.


యోగా ఎంవోయూ పత్రాలను పరస్పరం మార్చుకుంటున్న అధికారులు

గోదావరిలో మునిగి బాలుడు మృతి

- మరో ఇద్దరిని రక్షించిన స్థానికులు
- ప్రమాద స్థలాన్ని సందర్శించిన కలెక్టర్

భద్రాచలం, జూన్ 22: భద్రాచలం వద్ద శనివారం గోదావరిలో మునిగి అంగులూరి కార్తీక్(11) అనే బాలుడు మృతి చెందాడు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోని శ్రీరామనగర్ కాలనీలో వివాహ వేడుకకు హాజరైన ఏపీలోని ఏలూరు మండలం మాదేపల్లి, ఖమ్మం నగరానికి చెందిన కుటుంబాల సభ్యుల్లోని పలువురు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో కత్తుల ఏడుకొండలు, బొజ్జా తాండవ కృష్ణ, కార్తీక్, మల్లికార్జున్, రాము నదిలో స్నానం చేసేందుకు దిగారు. ఈ క్రమంలో ఏడు కొండలు, తాండవ స్నానం ముగించుకొని ఒడ్డుకు చేరగా కార్తీక్, మల్లికార్జున్, రాము స్నానం చేస్తూ నది లోతును అంచనా వేయలేక నీటిలో మునిగిపోయారు. దీంతో వీరి అరుపులు విన్న గజ ఈతగాళ్లు నదిలోకి దిగి మల్లికార్జున్, రాములను ఒడ్డుకు చేర్చారు. గల్లంతైన కార్తీక్(11)కోసం గాలించగా మృతదేహం లభ్యమై ంది. ప్రాణాలతో బయటపడ్డ మల్లికార్జున్‌కు భద్రా చలంలో ని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలుస్తోంది. ఈ ఘటన విషయం తెలుసుకున్న భద్రాచలం ఎస్ఐ విజయలక్ష్మి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


భద్రాచలం వద్ద గోదావరిలో మునిగి మృతి చెందిన కార్తీక్

ప్రమాదాలు జరుగకుండా నిరంతర నిఘా

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం వద్ద గోదావరి పరిసరాల్లో ఇకపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. నదిలో మునిగి బాలుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న కలెక్టర్ భద్రాచలంలోని గోదావరి స్నాన ఘట్టాల వద్దకు చేరుకొని స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదావరినది ఒడ్డున ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నది లోతు గురించి సమాచారం తెలిపేలా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, నీటిపారుదలశాఖ ఈఈ రాంప్రసాద్, భద్రాచలం సీఐ సంజీవరావు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించాలి

- ఆరోగ్యకరమైన ఆహారం అందించాలి
- ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, జూన్ 22 : పంటల సాగులో సేంద్రీయ వ్యవసాయ పద్ధతు లు పాటించడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందజేయాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. ఏరువాక పౌర్ణమి, రైతు సస్యవృద్ధి బీజరోపణ ఉత్సవం కార్యక్రమంలో భా గంగా శనివారం కాకినాడజిల్లా పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలోని వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయశాస్త్రవేత్తలతో కలిసి పీఠాధిపతి నాగలి పట్టి దుక్కుదున్నారు. ప్రకృతిసిద్ధంగా వ్యవసాయం చేయడం వలన భూసారం పరిరక్షింపబడుతుందని, తద్వారా లాభదాయకమైన ఫలసాయం పొందాలని చెప్పారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో నిర్వహించిన ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ సదస్సును ఆయ న జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తెలంగాణా రాష్ట్రం రాజేంద్రనగర్‌లోని అగ్రానమి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఏవీ రామాంజనేయులు, ఎంటమాలజీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్.రామగోపాలవర్మ, డాక్టర్ నీలిమ, డాక్టర్ రత్నప్రశాంతి, సీహెచ్ సత్యనారాయణ, అరుణ, అహ్మద్ ఆలీషా, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ రైతులుగా ఎంపికచేసిన సన్నిబోయిన నాగూరు అప్పారావు, పాఠంశెట్టి గోవిందు, ఆకుల వీర్రాజు, శీరం గంగరాజు, శీరెడ్డి పార్వతి, ఆదివిష్ణులను సత్కరించారు.




పిఠాపురంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలి పట్టి పొలంలో దున్నుతున్న పీఠాధిపతి ఉమర్‌ఆలీషా, ఉత్తమ రైతులను సత్కరిస్తున్న పీఠాధిపతి

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

మామిడికుదురు, జూన్ 22: గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా, ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ, అంటు వ్యాధుల నివారణకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో ఎస్ వేణుగోపాలరెడ్డి తెలియచేశారు. ఈకమిటీ చైర్మన్‌గా ఎంపీపీ కుసుమ వనజాకుమారితో పాటు ఏడుగురు సభ్యులు ఉంటారని, వర్షాకాలంలో అంటు వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టడం తదితర సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందన్నారు.

- కూలిన చెక్కల వంతెన
- సామంతకుర్రు పరిసర గ్రామాల ప్రజల పాట్లు
- అత్యవసర పరిస్థితుల్లో రేకు బోటు ఉపయోగం

పక్కా వంతెన నిర్మాణం ఎప్పుడు!



సామంతకుర్రు వద్ద డ్రెయిన్‌లో కూలిన చెక్కల వంతెన

అల్లవరం జూన్ 22: వాసాలతిప్ప డ్రెయిన్‌పై సామంతకుర్రు వద్ద దాత నిర్మించిన చెక్కల వంతెన కూలిపోయి పలు గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సామంతకుర్రు పరిసర గ్రామాల ప్రజలు ప్రమాద అంచుల్లో చెరువుల్లో మేత వేసే చిన్న బోటుపై రాకపోకలు సాగిస్తున్నారు. సామంతకుర్రు వద్ద వాసాలతిప్ప డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం ఎన్నికల హామీగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పరిధిలోని 12గ్రామాల ప్రజలు, రైతులు, మత్స్యకారులు గతంలో చెక్కల వంతెన మీదే రాకపోకలు సాగించారు. సామంతకుర్రు, చల్లపల్లి గ్రామాల మధ్య వాసాలతిప్ప డ్రెయిన్‌పై పక్కా వంతెన నిర్మాణానికి అధికారులు గతంలో అంచనాలు రూపొందించారు. నేటికీ ఆచరణలో అమలు కాక, కనీసం చెక్కల వంతెన లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాత నడింపల్లి లింగరాజు ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక చెక్కల వంతెనపైనే రాకపోలు సాగేవి. గత ఏడాది ఈచెక్కల వంతెన కూలిపోవడంతో చాలా వరకు రాకపోలు బంద్ అయ్యాయి. చెరువులో వాడే చిన్న రేకు బోటునే అత్యవసర పరిస్థితుల్లో దాటుతున్నారు. సామంతకుర్రు వద్ద పక్కా వంతెన నిర్మించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ



మలికిపురం: నేను బడికి పోతా ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, ఉపాధ్యాయులు, అధికారులు

మలికిపురం, జూన్ 22: బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్చడమే నేను బడికి పోతా ర్యాలీ కార్యక్రమం ఉద్దేశమని ఎంఈవో ఎం.విజయశ్రీ అన్నారు. మలికిపురం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బి.మంగాదేవి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్చి వారికి స్టూడెంట్ కిట్, ఇతర విద్యా ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. బడిలో చేరిన పిల్లల సామర్థ్యాలను మదింపు చేయడం, వయసుకు తగిన తరగతిలో చేర్చి ఆ తరగతి స్థాయి అందుకునేందుకు బ్రిడ్జి కోర్సు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వైవీవీ సత్యనారాయణ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేను బడికి పోతా

అమలాపురం టౌన్, జూన్ 22: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలంటూ విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమం శనివారం పట్టణ పరిధిలోని 30వ వార్డులో నిర్వహించారు. ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అంటూ విద్యార్థులు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌కాంప్లెక్సు చైర్మన్ బందా ఆర్.కామేశ్వరరావు, సీఆర్ఎంటీ ఎం.శ్రీనుబాబు, హెచ్ఎం ఎస్వీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

మామిడికుదురు, జూన్ 22: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించే విధంగా ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని తహసీల్దార్ ఎం.మేరికమ్మ కోరారు. మండలంలోని 60 ఆవాసా ప్రాంతాల్లో బడి బయట పిల్లలను బడిలో చేర్పేందుకు అవగాహన కార్యక్రమం స్థానిక ఎంఈవో కార్యాలయంలో శనివారం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లందరినీ బడిలో చేర్పే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, మండలపరిషత్ ఏవో కె.వెంకటేశ్వరరావు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, వసతిగృహం సంక్షేమ అధికారులు కె.ప్రవీణ్‌కుమార్, సి.నాగవేణి, పార్ట్‌టైమ్ ఇనస్ట్రక్టర్లు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

భూ దందాలను ఉపేక్షించేది లేదు: ఎమ్మెల్యే బండారు



ఆలమూరు, జూన్ 22: భూ.. దందాలను ఉపేక్షించేది లేదని, అటువంటి వాటిని ప్రోత్సహించే అధికారులను ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బడుగువానిలంకలో గోదావరి నదీగర్భంలో కలసిపోయిన భూమిని రికార్డుల్లోలేని వారి పేరుపై నమోదు చేయడానికి ఫారం-8 జారీ చేయడంపై శనివారం ఆంధ్రజ్యోతిలో "భూ.. దాహం"అనే శీర్షికపై వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. గుట్టుచప్పుడు కాకుండా భూములను కాజేయడానికి చేస్తున్న ప్రయత్నాలు మంచి పద్ధతి కాదని దీనిపై ఉన్నతాధికారులతో చర్చించినట్లు సత్యనందరావు ఆంధ్రజ్యోతితో చెప్పారు.

రికార్డులు సక్రమంగా లేవు.. భూమి సాగులో లేదు: ఆర్డీవో

బడుగువానిలంకలోని 33.4ఎకరాల భూమిపై నవీన్‌కుమార్ అనే వ్యక్తి చేస్తున్న దరఖాస్తుతో ఆలమూరు తహశీల్దార్ జారీ చేసిన ఫారం-8లో అభ్యంతరాలు వచ్చినా.. రాకపోయినా.. ఆన్‌లైన్ చేయడం వీలుకాదని కొత్తపేట ఆర్డీవో జీవీవీ.సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన భూ.. దాహం శీర్షికపై సంబంధిత రికార్డులు పరిశీలించామని దీనిలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి సరైన ఆధారాలు లేవని, అలాగే భూమి సాగులో లేదని పూర్తిగా నదీగర్భంలో ఉండటంతో ఆన్‌లైన్ చేయడం వీలు కాదని చెప్పారు. ఫారం-8 అభ్యంతరాలు లేకపోయినప్పటికీ దరఖాస్తు తిరస్కరిస్తున్నట్లు ఆర్డీవో వివరించారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 22: విద్యుత్ ప్రమాదాలు బారిన పడినవారికి అత్యవసర చికిత్సలపై ఏపీఈపీడీసీఎల్ సిబ్బందికి ఏరియా ఆసుపత్రి పర్యవేక్షక వైద్యులు డాక్టర్ ప్రవీణ్ అవగాహన కల్పించారు. శనివారం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ఏనర్జీ అసిస్టెంట్ గ్రేడ్-2లకు డీటీఆర్ నిర్వహణ, విద్యుత్ సేఫ్టీపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీఆర్, లైన్లు నిర్వహణ, ఎల్‌సీ యాప్ ప్రొసీజర్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. విద్యుదాఘాతానికి గురైన సమయంలో ప్రాథమిక సీపీఆర్ చేయువిధానం, కాల్స్ ప్రోగ్రామ్ ఏవిధంగా చేయాలన్న దానిపై డాక్టర్ ప్రవీణ్ అవగాహన కల్పించారు. అగ్నిమాపక దళ అధికారి విద్యుత్ కారక అగ్ని ప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఈఈ వై.విజయానంద్, కంచుమర్తి మురళీమోహన్, చొల్లంగి శ్రీదర్, ఏఈలు కె.సాంబశివరావు, మేడిశెట్టి వెంకట రమణ, ఎస్.ఏసురాజు, నజీర్ ఖాన్, ఏచీటి డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

పి.గన్నవరం, జూన్ 22: ఉడిమూడి శివారు చింతావారిపేటలో గత నెల14న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. నష్టపరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం బాధిత కుటుంబ సభ్యులు వినతిపత్రం అందించారు. రాజోలు డిపో నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సుట్రాక్టర్లో ధాన్యం లోడు చేస్తున్న కూలీలను వెనుక నుంచి ఢీకొట్టింది. ఉడిమూడి, గంటిపెదపూడికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. తర్వాత చికిత్స పొందుతూ మరో యువకుడు, బస్సుకండక్టర్ మృతిచెందారు. సంఘటన సమయంలో బస్సుడ్రైవర్ నిర్లక్ష్యంతో కూలీలు మృతి చెందారని బంధువులు రోడ్డుపై బైఠాయించారు. కలెక్టర్, జేసీలతో కొత్తపేట ఆర్డీవో,డీఎస్పీ,స్థానికఎస్ఐలు మాట్లాడి రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తా మని హామీ ఇచ్చారు. ఇంకా నష్టపరిహారం ఇవ్వకపోవ డంతో బాధిత కుటుంబసభ్యులు వినతిపత్రం అందించారు.

జాబ్ మేళాలో 54మంది ఎంపిక

కొత్తపేట, జూన్ 22: కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఏడు కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహించారు. 213మంది అభ్యర్థులు హాజరు కాగా 54మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 59మంది విద్యార్థులు సెకండ్ రౌండ్ ఇంటర్వ్యూకు షార్ట్ లిస్ట్ అయినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. వికాస, డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో ఎంపికైనఅభ్యర్థులందరికీ ఆఫర్ లెటర్స్ ఇచ్చినట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. వికాస ప్రతినిధులు, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, డాక్టర్ జి.శ్రీనివాసులు, డాక్టర్ కె.అంకమరావు, డాక్టర్ కేఎస్ఎస్, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, డి.కావ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాతృ వియోగం



ఉప్పలగుప్తం, జూన్ 22: గోపవరం మాజీ సర్పంచ్, జనసేన నాయకుడు అయితాబత్తుల వెంకటకృష్ణారావు తల్లి చిట్టెమ్మ(86) శనివారం మృతి చెందారు. ఆమె కుమారుల్లో మరొకరు ఉమామహేశ్వరరావు కోనసీమ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి కాగా మూడో కుమారుడు బాలకృష్ణ పోలీసు శాఖలో పనిచేస్తున్నారు. వీరిని జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు పరామర్శించారు.

మార్కెట్లో రబ్బర్ మ్యాట్స్ ఏర్పాటు చేయాలి

యానాం, జూన్ 22: యానాం ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ప్రమాదాల నివారణకు రబ్బర్ మ్యాట్స్ ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు. రబ్బర్ మ్యాట్స్ లేకపోవడంతో మార్కెట్‌కు వచ్చేవారు జారిపడిపోతున్నారన్నారు. మార్కెట్‌ను పారిశుధ్యం సిబ్బంది పట్టించుకోకపోవడం లేదన్నారు.ఆశీలు పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, శుభ్రం చేయించడంలో నిర్లక్ష్య వహిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేదన్నారు. రబ్బర్ మేట్స్ ఏర్పాటుచేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

డయేరియా ప్రబలకుండా పారిశుధ్య చర్యలు

అంబాజీపేట, జూన్ 22: అధికారులు సమన్వయంతో పనిచేసి డయేరియా ప్రబలకుండా అందరూ సహకరించాలని అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సరోవర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో డయేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వాటర్ ట్యాంకులు శుభ్రపరచడం, ధ్వంసమైన పైపులైన్లు పునరుద్ధరించడం, గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై దృష్టి పెడుతున్నామన్నారు. డయేరియా ప్రబలకుండా మండలంలో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో పర్యటించి మంచినీరు, పారిశుధ్య పనులను పరిశీలించామన్నారు. వైద్య సిబ్బందితో ఇంటింటా సర్వే చేయిస్తామన్నారు. ఈవోపీఆర్డీ బి.మమత, వైద్యాధికారులు బీఎన్ శ్రీనివాస్, ఎ.ఇంద్రావతి, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సేవలు అందించడమే లక్ష్యం

అంబాజీపేట, జూన్ 22: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలందించడమే వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ లక్ష్యమని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుగ్గు ప్రసన్నరావు అన్నారు. ముక్కామల వాసవీ వనితా క్లబ్ సహకారంతో ముక్కామల, ఇరుసుమండ, మొసలపల్లి, గంగలకుర్రు అగ్రహారం, ఇందుపల్లి గ్రామాల్లో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు గ్రామాల్లో ఐదుగురు దివ్యాంగులకు చేతికర్రను, వీధి వ్యాపారులకు గొడుగులు, ఇరవై మంది పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించామన్నారు. పోలీసుల సేవలను గుర్తించి ఐదు మాస్కులు, టవల్స్ ఫ్లోరోసెంట్ జాకెట్లు అందజేశారు. దాతలకు సత్కారం చేశారు. ముక్కామలలో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామదేవత అంకాలమ్మకు బంగారు సూత్రాలు, వెండి పాత్రలను బహూకరించారు. స్థానిక అధ్యక్ష, కార్యదర్శులు బచ్చు సత్యనారాయణమూర్తి, కేదారశెట్టి సత్యనారాయణ, కోశాధికారి అప్పన శ్రీరామచంద్రమూర్తి, నూలు వరలక్ష్మి, గోళ్ల బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన ప్రారంభం

అమలాపురం టౌన్, జూన్ 22: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ సుపరిపాలన ప్రారంభమైందని ఆలిండియా కోకోనట్ గ్రోవెర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బోనం నాగేశ్వరరావు పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో సహా బీజేపీ నాయకుల సహకారంతో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దూసుకుపోవడం ఖాయమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసిందని, ఈపరిస్థితుల్లో రాష్ట్రాన్ని ముందుకు నడిపించగల సత్తా ముఖ్యమంత్రిగా చంద్రబాబుకే ఉందన్నారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు సముచిత స్థానం కల్పించి ప్రమాణం స్వీకారం చేయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయన వెంట ఎంపీపీ కేతా శ్రీను, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, గుబ్బల శ్రీను, గుండాబత్తుల తాతాజీ, మండేల శ్రీను, చేగొండి శ్రీను, పిల్లి శ్రీరామమూర్తి, కట్టా సూరిబాబు పాల్గొన్నారు.

టీడీపీ నేతల పరామర్శ

అల్లవరం, జూన్ 22: మొగళ్లమూరికి చెందిన అల్లు గణేష్‌మణికంఠ ఇటీవల రోడ్డు ప్రమాదంలో, అల్లవరం బిల్లు కలెక్టర్ కొపనాతి సూర్యవంశరాజు గుండెపోటుతో మరణించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓడలరేవులో టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, చింతా శ్రీనివాస్, కొల్లు విష్ణుమూర్తి, అల్లూరి గోపాలకృష్ణంరాజు, నాతి లెనిన్‌బాబు పరామర్శించారు.

ధాన్యం సొమ్ములు చెల్లించాలని రైతుల ఆందోళన



మోదుకూరులో ఆర్‌బీకే వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు ఆపాలని డిమాండ్

ఆలమూరు, జూన్ 22: రబీలో పండించిన ధాన్యం అమ్మకాలు చేసి చాలా రోజులు గడిచినప్పటికీ ధాన్యం సొమ్ములు నేటికి విడుదల కాకపోవడంతో ఆలమూరు మండలంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదుకూరు రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఆర్‌బీకేల ద్వారా అమ్మకాలు చేసుకున్న రైతులు ఖరీఫ్ సాగుకు పెట్టుబడులు లేకపోవడంతో పాటు రబీలో తీసుకున్న అప్పులు, కోత యంత్రాలకు చెల్లింపులు, పురుగుల మందులు, ఎరువుల బకాయిలు చెల్లించలేకపోవడంతో తమపై తీవ్ర ఒత్తిడి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం అమ్మకాలు చేసుకున్న 28రోజుల లోపులో ధాన్యం సొమ్ములు చెల్లిస్తామని చెప్పిన ఆర్‌బీకే వారు దాదాపు రెండు నెలలు అయినప్పటికీ బ్యాంకుల్లో సొమ్ములు జమ కావడం లేదని రైతులు వివరించారు. రబీలో పండించిన ధాన్యాన్ని ఎన్నో వ్యయప్రయాసలతో మిల్లులకు చేర్చామని, తమ ఇబ్బందులను గుర్తించే నాథుడే లేకపోయాడని వారు అన్నారు. వచ్చే సీజన్‌లో ఆర్‌బీకేల ద్వారా కాకుండా నేరుగా ధాన్యం అమ్మకాలు చేసుకునే విధంగా నిబంధనలు సడలించాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా ధాన్యం సొమ్ములు బ్యాంకుల్లో జమ చేసినప్పటికీ బ్యాంకులో రోజుకు రూ.30 వేలు మాత్రమే తీసుకోవాలని నిబంధనలు పెడుతున్నారని దీంతో తాము ప్రతీరోజు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

యానాంలో పుదుచ్చేరి ఎస్పీ పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ లక్ష్మీసౌజన్య

యానాం, జూన్ 22: పుదుచ్చేరికి చెందిన సీనియర్ ఐపీఎస్, ఎస్పీ లక్ష్మీసౌజన్య మూడు రోజుల పర్యటనకు యానాం వచ్చారు. శనివారం యానాంలోని పోలీస్ స్టేషన్లను పరిశీలించారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం నేతృత్వంలో అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్వహించాల్సిన పనులను, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం యానాం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హాలులో వివిధ గ్రామాల ప్రతినిధులు, సంఘాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పోలీస్ పరంగా ఉన్న సమస్యలు, శాంతిభద్రతల పరిరక్షణకు ఇంకా చేపటాల్సిన చర్యలపై అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో గస్తీ పెంచాలని, గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని తదితర అంశాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలుతీసుకుంటామని సౌజన్య తెలిపారు.

పీఠంలో ఘనంగా జ్యేష్ఠ పౌర్ణమి పూజలు



అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు.



రాయవరం, జూన్ 22: వెదురుపాక విజయదుర్గా పీఠంలో జ్యేష్ఠ పౌర్ణమి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో తొలుత విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పీఠం అర్చకుడు శివ అర్చకత్వంలో విజయదుర్గా అమ్మవారికి దుర్గా, లలితా అష్టోత్తర, సహస్రనామాలు, లక్ష్మి, సరస్వతి అష్టోత్తరాలతో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, నవగ్రహ నక్షత్రహోమం పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి దర్శించుకున్న భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు. విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే సత్యవెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనకదుర్గ, పీఠం పీఆర్వో బాబి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేశారు.. బెర్ములు మరిచారు

కె.గంగవరం, జూన్ 22: యర్రపోతవరం నుంచి శివల వరకు ఉన్న రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. పాత రహదారి కంటే అడుగున్నర ఎత్తు రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరువైపులా బెర్ములను వేయకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహ దారి నుంచి వీధుల్లోకి వెళ్లే అప్రోచ్ రోడ్ల ప్రక్కన బెర్ములు వేయలేదు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్అండ్‌డీ అధికారులు స్పందించి బెర్ములు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.



యర్రపోతవరంలో బెర్ములు లేకుండా ఉన్న సీసీ రోడ్డు

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

అమలాపురం టౌన్, జూన్ 22: పి.గన్నవరం మండలం ఊడిమూడిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రతీ కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నేటికీ ప్రభుత్వ పరంగా ఏవిధమైన ఆర్థిక సహకారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జాప్యం జరిగిందని చెప్పిన ఉన్నతాధికారులు నూతన ప్రభుత్వం ఏర్పాటైనందున తక్షణ సహకారం అందించాలన్నారు. సమావేశంలో శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్ల ఎండు గడ్డి అందజేత

అంతర్వేది, జూన్ 22: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉన్న గోశాలకు వీరవాసారం మండలం వేమవరానికి చెందిన నామాన నాగేశ్వరరావు రూ.25వేలు విలువైన రెండు ట్రాక్టర్ల ఎండు గడ్డిని అందించారు. కార్యక్రమంలో రావి ప్రసాద్, బెల్లంకొండ రాంబాబు, గుత్తుల శ్రీను, దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాకర్స్ అంతర్జాతీయ కౌన్సిల్ సమావేశం

అమలాపురంటౌన్, జూన్22: అమలాపురం వాకర్స్ క్లబ్ సారథ్యంలో ఆదివారం అమలాపురం కూచిమంచి అగ్రహారం రోడ్డులోని శ్రీకళా గ్రాండ్‌లో అంతర్జాతీయ వాకర్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు స్థానిక క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ తెలిపారు. 12ఏళ్ల అనంతరం అమలాపురంలో అంతర్జాతీయ కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. 300మంది ప్రతినిధులు నాలుగు రాష్ట్రాల నుంచి కౌన్సిల్ సమావేశానికి హాజరవుతారు. సమావేశ పర్యవేక్షణ బాధ్యతలను డాక్టర్ పీఎస్ శర్మ, డాక్టర్ గోకరకొండ నాగేంద్రలు నిర్వర్తిస్తారు. తేతల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

అమలాపురం టౌన్, జూన్ 22: నీటి సంరక్షణలో భాగంగా బండారులంక భవిత కేంద్రంలో మిషన్ లైఫ్ యాక్టవిటీలో భాగంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం పోటీలను పరిశీలించారు. ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, భవిత సెంటర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: నింద
శేఖర్ స్క్రీన్-2	: అంతిమ తీర్పు
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: రాజధాని రౌడీ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హరోం హర
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం

గ్రాడ్యుయేషన్ డే

అంతర్వేది, జూన్ 22: రామేశ్వరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సర్పంచ్ ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ డి.అన్నపూర్ణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు అందిస్తారని సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ మీరా మణిపాల్ తెలిపారు. శివకుమార్, జి.తాతారావు, కె.శ్రీలత, బి.కుమారి, రత్నకుమారి, సౌభాగ్యం, మాధవి పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



అయినవిల్లి, జూన్ 22: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషిచేసిన అయినవిల్లి ఎంపీడీవో టీఎస్ మూర్తిని శుక్రవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా సత్కరించారు. ఎంపీడీవో మూర్తిని పలువురు అభినందించారు.

యోగాపై అవగాహన

రావులపాలెం, జూన్ 22: ఈతకోట పంచాయతీ సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాలు వద్ద ఎస్ఎంఎస్‌జీ ఉచిత సంచార్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐ అభ్యర్థులకు కౌన్సెలింగ్

అమలాపురం టౌన్, జూన్ 22: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశం కోసం ఇప్పటికే ఇంటర్వ్యూలు నిర్వహించామని సీట్లు రాని అభ్యర్థులకు జనరల్ పూల్ ద్వారా రెండు రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎంవీజీ వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ నంబర్ 1 నుంచి 561 వరకు ఈనెల 24న, 562 నుంచి 1115వరకు మిగిలిన సీట్లకు 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కాట్రేనికోన, జూన్ 22: చెయ్యేరు పంచాయతీ మరకోడులో శనివారం రొయ్యల చెరువు వద్ద ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో మట్టా సూర్యశేఖర్(33) అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య దుర్గాభవాని ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

ఉచిత కేన్సర్ వైద్య పరీక్షలు

అల్లవరం, జూన్ 22: ఎడాప్ట్ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోడిలంక బైర్రాజు ఫౌండేషన్ వద్ద ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. శనివారం ఈశిబిరాన్ని లయన్ నడింపల్లి వెంకట్రామరాజు, గ్రామ సర్పంచ్ రుద్రరాజు పవిత్ర ప్రారంభించారు. అత్యాధునిక వైద్య పరికరాలతో 180మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇండో-అమెరికన్ బసవతారకం కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు రవిశంకర్, శ్రావణికుమారి, సులోచనారాణిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. వేగిరాజు సుబ్బరాజు (శ్రీనురాజు), రుద్రరాజు లక్ష్మీపతిరాజు, డాక్టర్ రవిరాజు, రుద్రరాజు సత్తిబాబురాజు, పంచాయతీ కార్యదర్శి కంకిపాటి సత్యనారాయణ, ఆర్.కాశీ విశ్వనాథరాజు, అల్లూరి సూర్యనారాయణరాజు, అల్లూరి శివరామరాజు, నాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోకేశ్‌ను సత్కరించిన ఎంపీలు

అమలాపురం టౌన్, జూన్ 22: మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, ఐటీ మంత్రి నారా లోకేష్‌ను శనివారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు.



తాగునీటి సరఫరా పెంచాలని నిరసన



పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కె.గంగవరం, జూన్22: కె.గంగవరంలో తాగునీటిని30నిమిషాలు మాత్రమే సరఫరా చేస్తున్నారని, సరఫరా సమయాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు వి.భీమశంకరం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ప్రతీ రోజు సాయంత్రం కూడా నీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. నాయకులు బి.సిద్ధూ, చింతా రాజారెడ్డి, కాశి లెనిన్‌బాబు, కె.అనంతలక్ష్మి, చింతా చంద్రరావు పాల్గొన్నారు.

కువైట్ బాధితులతో ఎమ్మెల్సీ ముఖాముఖి

అంతర్వేది, జూన్ 22: అంతర్వేదిపాలెం, మోరి వి.కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ ఆదివారం సాయంత్రం కువైట్‌లో చిక్కుకుపోయిన బాధితుల కుటుంబాలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వి.కన్వెన్షన్ హాలు యజమాని ఓగూరి ఆక్రోష్ తెలిపారు. కువైట్‌లో చిక్కుకున్న బాధితులెవరైనా ఉంటే ఆక్రోష్ మొబైల్ నంబరు 9989839848లో సంప్రదించాలన్నారు. జూన్ 30వ తేదీలోపు కువైట్‌లో ఎటువంటి కాగితాలు లేకుండా ఆ దేశంలో చిక్కుకుపోయిన వారు నిరభ్యంతరంగా దేశం విడిచి వెళ్లిపోవడానికి క్షమాభిక్ష కోరే విధంగా స్వదేశానికి రావడానికి అవకాశం ఉన్న సమాచారం చాలా మందికి తెలియక వేలాది మంది హౌస్ మేట్స్ కువైట్ రాజును కోరే విధంగా ఈ ఎమ్మెల్సీ సంస్థ వారందరికీ తెలియపరచడానికి ముఖాముఖి ఏర్పాటు చేసింది. దళిత, బీసీ, ఓసీ, మైనార్టీ తదితర బాధితుల కుటుంబాల వారు స్వయంగా వచ్చి ఎమ్మెల్సీకి వివరాలు అందించాలన్నారు. ఆ వివరాలను ఎమ్మెల్సీ భారత విదేశాంగ మంత్రి, కువైట్ రాజుకు తక్షణమే లిస్టు పంపించి అక్కడున్న బాధితులందరూ ఈఅవకాశం వినియోగించుకోవాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబి గాబ్రియల్ కోరారు.

రైతు పూజ్యనీయుడు

అంబాజీపేట, జూన్ 22: ప్రజలందరికీ పట్టెడు అన్నం పెట్టే రైతు పూజ్యనీయుడని కోనసీమ ఆహారనిధి అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ పేర్కొన్నారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఇరుసుమండలో ఆహారనిధి, జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు పూజోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పూజలు నిర్వహించి దుక్కి దున్నారు. రైతులకు నూతన వస్త్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో రంకిరెడ్డి కాశీ, విజయరావు, ఏడుకొండలు, మహేష్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

అయినవిల్లి, జూన్ 22: నల్లచెరువు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅలివేలు మంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శనివారం తెల్లవారుజాము నుంచి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులకు అన్నప్రసాదం స్వీకరించారు.